క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ రామకృష్ణ

పెదపూడి: పెదపూడి ఎస్‌ఐగా టి.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఇప్పటివరకూ రంగంపేట మండలం ఎస్‌ఐగా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతకాలం పెదపూడిలో ఎస్‌ఐగా పనిచేసిన పి.వాసు కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయంలోని డీటీసీకి బదిలీ అయ్యారు.

వాహనం వితరణ


దివ్యాంగురాలు కృపావతికి వాహనం అందజేసిన నాయకులు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన శ్రీలలితా మెమోరియల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పి.చిన్ని ఆధ్వర్యంలో రంపయర్రంపాలేనికి చెందిన దివ్యాంగురాలు కృపావతికి వాహనం వితరణ చేశారు. గుమ్మళ్లదొడ్డికి చెందిన గంటి సుబ్బారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాస్ సహకారంతో సమకూర్చిన ఈ వాహనాన్ని సోమవా రం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ సభ్యుడు తొట్టా సత్యనారాయణ, ఉప సర్పంచ్ దాకారపు ధర్మరాజు, ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు బళ్లా శ్రీనివాస్‌రావు, కార్యదర్శి గంటి వెంకటేష్ పాల్గొన్నారు.


వీరబ్బాయికి పీహెచ్‌డీ

రాజానగరం: పాలచర్లలోని బీవీసీ కాలేజీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొత్తపల్లి వీరబ్బాయికి ఆంధ్ర యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ లభించింది. కామర్స్ అండ్ మేనేజ్మెంట్ విభాగంలో ది ఇంప్యాక్ట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆన్ ఎంప్లాయిస్ ప్రొడక్టివిటీ - ఏ స్టోరీ ఆన్ ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ అనే పరిశోధనకు పీహెచ్‌డీ లభించింది.

ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి


చంద్రేడులో గాయత్రీదేవి అలంకరణలో కాత్యాయనీదేవి


బిక్కవోలులో ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి అమ్మవారు


సంపరలో గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చిన విజయదుర్గమ్మ


గాయత్రీదేవి అలంకారంలో గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ

అనపర్తి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గ్రామ గ్రామాన ఆలయాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. సోమవారం అమ్మవారు గాయిత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీవీరుళ్లమ్మ వారి దేవస్థాన కమిటీ సారథ్యంలో త్రిశక్తి పీఠంలో అమ్మవారిని శ్రీగాయత్రీదేవిగా అలంకరించారు. స్థానిక శాంతిపురంలోని శ్రీగణపతి, శ్రీసరస్వతి సహిత శ్రీమహాలక్ష్మిదేవి ఆలయంలో ఆలయ అర్చకులు రాంబాబుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బిక్కవోలు: బిక్కవోలు శ్రీగోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన ఉన్న పార్వతీదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. పందలపాక వెలమపేట రామాలయంవద్ద అమ్మవారిని బాలాత్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. కొమరిపాలెం, బలబద్రపురం, తొస్సిపూడి గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు చేశారు.

పెదపూడి: దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మండలంలో జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, కాండ్రేగుల, రామేశ్వరం, ఏపీత్రయం, దోమాడ, కరకుదురు, సంపర తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సోమవారం రెండో రోజు దుర్గాదేవికి విశేష పూజలు చేశారు. అమ్మవారు గాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, విశేష హారతులు ఇచ్చారు.

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడులో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామివారి ఆలయంలో దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం కాత్యాయనీ అమ్మవారు గాయత్రీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు మైలవరపు కష్ణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమ అర్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

గాయత్రీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం గోకవరం చేవీచౌక్ కనకదుర్గమ్మ గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నేడు అన్నపూర్ణాదేవి అలంకారం

శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం గోకవరం దేవీచౌక్‌లో కొలువైన కనకదుర్గమ్మ, వీరభద్రునిగద్దెలోని కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

రాజానగరం: ముగ్గురు యువకులు బైకుపై అతివేగంతో ఢీకొనడంతో రోడ్డు దాటుతున్న మహిళ మృతి చెందింది. జాతీయ రహదారిపై దివాన్ చెరువులో సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామంలోని నీలంతోట ఏరియాలో నివాసం ఉంటున్న గంటా వరలక్ష్మి (30) ఇరుగు పొరుగు మహిళలతో కలసి పాతూరులో ఏర్పాటు చేసిన శరన్నవరాత్ర ఉత్సవాల మండపంలో జగన్మాతను దర్శించుకుంది. అనంతరం నీలం తోటకు తిరిగి రావడానికి రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో రాజమహేంద్రవరం వైపు నుంచి ముగ్గురు యువకులు బైకుపై వేగంగా వచ్చి ఆమెను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె వెంట ఉన్న ఇతర మహిళలు డివైడర్ పైనే ఉండటంతో ప్రమాదం నుంచి తప్పించుకోగలిగారు. బైక్‌పై యువకులు స్వల్పంగా గాయపడ్డారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొమ్మూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న నిరసన

గోకవరం: స్థానిక వారపుసంతలో నూతనంగా నిర్మిస్తున్న షాపుల విషయంలో నిరసనకు దిగిన వ్యాపారులు రెండోవారం కూడా సంతను నిలిపివేసి నిరసన కొనసాగించారు. వరుసగా రెండో వారం సంత నిలిచిపోయింది.

సారా కేసులో మహిళ అరెస్టు

రంగంపేట: అచ్యుతాపురంలో నిర్వహించిన తనిఖీల్లో 20 లీటర్ల సారా కలిగి ఉన్న బొర్రా నర్సమ్మ అనే మహిళను అరెస్టు చేశామని ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి సోమవారం తెలిపారు. ఆమె ఇచ్చిన సమాచారం ఆధారంగా సారా సరఫరా చేసిన ఈలకొలను గ్రామానికి చెందిన లక్ష్మణస్వామిపై కూడా కేసు నమోదుచేశామని అన్నారు.

జపమాల ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ ఎస్సార్ నగర్ ఆర్సీఎం చర్చిలో సోమవారం జపమాల ప్రార్థనలు జరిగాయి. రెవరెండ్ ఫాదర్ మాణిక్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉపదేసి బెల్లపు డేవిడ్, అమ్మాజీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి సోమవారం ప్రారంభించారు. ఎంపీడీవో జేవీ ఝాన్సీ, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: నామవరం ఆర్‌బీకే వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వపరంగా రైతులకు కల్పిస్తున్న సదుపాయాలను మండల వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు వేమగిరి కృష్ణ, తహసీల్దార్ పవన్ కుమార్, వ్యవసాయాధికారులు వివరించారు.

మొక్కలు నాటడానికి స్థలాలు గుర్తించాలి


రఘుదేవపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డ్వామా ఏపీడీ శ్రీనివాస్

సీతానగరం: మొక్కలు నాటడానికి స్థలాలను గుర్తించాలని ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు డ్వామా ఏపీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ సూచించారు. ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల గ్రామాల్లో కాలువ గట్లకు ఇరువైపులా నాటిన కొబ్బరి మొక్కలను ఏపీవో కె.నాగ శేషవేణితో కలసి సోమవారం ఆయన పరిశీలించారు. రెండు కిలోమీటర్ల మేరకు మూడేళ్ల క్రితం ఉపాధి పథకంలో కూలీలు 500 కొబ్బరి మొక్కలను నాటారని ఏపీవో తెలిపారు. అనంతరం రఘుదేవపురం 1, 2 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీడీ పరిశీలించారు. అదే గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందించే వైద్యసేవలను పరిశీలించారు. సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీడీవో కె.రమేష్ మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో హౌసింగ్ ప్రగతిపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లకు చర్యలు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- అనపర్తిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం


అనపర్తిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ సచివాలయం-5లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ప్రారంభం కాకముందే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ప్రభుత్వానికి అన్నదాతలపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అన్నదాతలు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నూతన విధానాలను అమలుచేస్తోందని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్నదాతలకు నష్టం కలగకుండా, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అన్నివిధాలా మేలు జరిగేలా ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ అంనూరి సూర్యనారాయణ, మండల ప్రత్యేక అధికారి, రుడా వైస్ చైర్మన్ బి.బాలాస్వామి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ వై.సరస్వతి, మండల వ్యవసాయాధికారి బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రామవరం రైతు భరోసా కేంద్రం-1లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ గిరడా గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డిలు సోమవారం ప్రారంభించారు.

కేవీకేలో మహిళా రైతు దినోత్సవం

రాజానగరం: వ్యవసాయరంగం పురోభివృద్ధిలో మహిళా రైతుల పాత్ర కీలకమని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. కలవచర్లలోని కేవీకేలో సోమవారం మహిళా రైతు, ప్రపంచ ఆహార దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆత్మా పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ వై. జ్యోతిర్మయి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయానికి ఇస్తున్న రాయితీలను వివరించారు. ఈ సందర్భంగా అనపర్తికి చెందిన గుత్తుల మంగారత్నం, కలవచర్లకు చెందిన శివకుమారిని సన్మానించారు. అలాగే ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళ కళాశాలకు చెందిన 60 మంది అగ్రి ఇంజినీరింగ్ విద్యార్థినులు కేవీకేలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో పాల్గొన్నారు.

గ్రామాల నుంచి కలశాలతో మట్టి

పెదపూడి: నా భూమి-నా దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు కలశాలతో మట్టిని తీసుకొచ్చి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కలశంలో వేస్తున్నారని ఎంపీపీ కేతా తులసి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ మట్టిని త్వరలో ముగ్గురు వ్యక్తుల బృందం ఢిల్లీకి తీసుకెళతారని చెప్పారు. అనంతరం మట్టి నింపిన కలశంతో పెదపూడిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.విజయ బాస్కర్, ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్‌రెడ్డి, ఏపీఓ కాంచన తదితరులు పాల్గొన్నారు.

19న ఉచిత కంటి వైద్య శిబిరం

పెదపూడి: మండలంలోని కరకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నామని సర్పంచ్ వుండ్రు చంద్రకళ, హితకారిణి సమాజం డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ దంపతులు సోమవారం తెలిపారు. కాకినాడ శ్రీకిరణ్ కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహిస్తారని, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొలిక్కిరాని వివాదం

సీతానగరం: కూనవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌డ్కర్ విగ్రహం వివాదం ఇంకా పరిష్కారం కాలేదు. తహసీల్దార్ కృష్ణారావు, కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు అంబటి రాజు, రూరల్ ఆంధ్ర మూమెంట్ అధ్యక్షుడు బర్రే ఆనందబాబు ఆ విగ్రహ వివాదంపై సోమవారం చర్చలు జరిపారు. సమస్య ఇంకా పరిష్కారం కాలేదు.

ఇంటర్న్‌షిప్‌ను వినియోగించుకోవాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అకడమిక్ విద్యతో పాటు ఇంటర్న్‌షిప్ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. పౌరసరఫరాలు, గ్రామ, వార్డు సచివాలయ సేవల విభాగంలో ఐదు వారాల ఇంటర్న్ షిప్ కోసం త్రొర్రేడు ఎలిషా డిగ్రీ కళాశాల విద్యార్థినులతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్, జేసీ తేజ్ భరత్ సంభాషించారు. కలెక్టర్ మాట్లాడు తూ పౌరసేవలు, ప్రజాపంపిణీ వ్యవస్థ కార్యకలాపాలపై అవగాహనకు ఇంటర్న్‌షిప్ ఉపయోగపడుతుందన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి


కృష్ణునిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి మందుల కిట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల రామస్వామి, సర్పంచ్ రౌతు ఆదిలక్ష్మి, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సీనియర్ నాయకులు సుంకర వీరబాబు, దాసరి సతీష్‌బాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్, రౌతు జోగేశ్వరరావు, అంబటి ప్రసన్న, తోలేటి రాంప్రసాద్, ఇజ్జిన కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

627 మందికి వైద్య సేవలు

సీతానగరం: రఘుదేవపురం గ్రామ సచివాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో 627 మందికి సేవలందించారు. డాక్టర్లు రాజు, ఏసురాణి, మేఘన, స్పెషలిస్టులు ఎం.ప్రజ్ఞ (జనరల్ సర్జన్), రాజేంద్రబాబు (కీళ్ల వ్యాధులు) వైద్యపరీక్షలు జరిపారు. 98 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 91 మందికి కళ్ల జోళ్లు అవసరమని గుర్తించారు. వారికి త్వరలో కళ్ల జోళ్లు అందిస్తామన్నారు. గతంలో పరీక్షలు నిర్వహించిన 20 మందికి కళ్లజోళ్లు అందించారు. 35 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. బీపీ, షుగర్, ఈసీజీ, టీబీ, రక్తం, నీరుడు పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.రమేష్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, ఎంపీహెచ్ఎస్ కె.సుధాకర్, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ఎస్.రాజు పాల్గొన్నారు.

మధురపూడిలో..

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి సచివాలయం వద్ద సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 528 మందికి దోసకాయలపల్లి పీహెచ్‌సీ వైద్యుడు కోటేశ్వరరావు, కోటికేశవరం పీహెచ్‌సీ వైద్యురాలు పుణ్యశాంతి ఆధ్వర్యంలో డాక్టర్లు ప్రజ్ఞ, లావణ్య వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాపారావు, ఈఓపీఆర్డీ మహేశ్వర ప్రతాప్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసి, పార్టీ నాయకులు ఇండిగమెల్లి సత్యనారాయణ, బత్తిన త్రిమూర్తులు, సెక్రటరీ బత్తుల సురేష్‌బాబు

సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా

బిక్కవోలు: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి అన్నారు. సోమవారం కొమరిపాలెం సచివాలయం-2 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొవ్వూరి జ్యోతిర్మయి మాట్లాడుతూ పేదలకు గ్రామ స్థాయిలోనే వైద్యం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ జి.విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

పెదపూడి: గ్రామీణ పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. సోమవారం రాజుపాలెంలో సర్పంచ్ గుత్తుల పుష్పావతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 474 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, ఉప సర్పంచ్ నాగుమళ్ల వీరభద్రరావు, సచివాలయ కార్యదర్శి ఎం.చిన్ని, ఈఓపీఆర్డీ ఎంఎస్ఎన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ పాల్గొన్నారు.

పొట్టిలంకలో 433 మందికి..

కడియం: పొట్టిలంకలో నిర్వహించిన వైద్యశిబిరంలో 433 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో గైనకాలజీ, ఆప్తమాలజీ, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు జరిపారు. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తిలు ప్రారంభించారు. శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, నాయకులు కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ఈలి శ్రీను, తహసీల్దార్ ఎం.సుజాత పాల్గొన్నారు.


రఘుదేవపురంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు